రాహుల్‌గాంధీపై ఈసీకి బీఆర్‌ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై కేంద్ర ఎన్నికల సంఘానికి బీఆర్‌ఎస్ ఫిర్యాదు చేసింది. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకున్నా, శనివారం తుక్కుగూడ కాంగ్రెస్ సభలో దురుద్దేశంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ తమ పార్టీ, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై వ్యాఖ్యలు చేశారని తెలిపింది. ఇది ఎన్నికల నియమావళిని ఉల్లంఘించటమేనని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. కేసీఆర్ పోలీస్ వ్యవస్థను దుర్వినియోగం చేసి, వేల మంది ఫోన్లను ట్యాప్ చేశారని, ఫోన్ ట్యాపింగ్ ద్వారా ఆర్థిక ప్రయోజనాలు పొందారని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని, వీటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ, అందుకు సంబంధించిన వీడియోల ను జతపరిచింది. ఈ మేరకు బీఆర్‌ఎస్ తరఫున కేంద్ర ఎన్నికల సంఘానికి పార్టీ నాయకులు కర్నె ప్రభాకర్, దాసోజు శ్రవణ్ ఫిర్యాదు చేశారు. ఇదే ఫోన్‌ట్యాపింగ్ అంశంపై మాట్లాడిన మంత్రి కొండా సురేఖపైనా చర్యలు తీసుకోవాలని మరో ఫిర్యాదును పంపింది.

కాంగ్రెస్ మైండ్ గేమ్

బీఆర్‌ఎస్‌ను వీడేదే లేదు: కాలేరు

అంబర్‌పేట, ఏప్రిల్ 8: కాంగ్రెస్‌లో చేరతానని తనపై కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని, ఇదంతా ఆ పార్టీ మైండ్ గేమ్ అని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆరోపించారు. సోమవారం బాగ్‌అంబర్‌పేటలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రెండు పర్యాయాలు బీఆర్‌ఎస్ పార్టీ తనను ఎమ్మెల్యేను చేసిందని, సీఎం కేసీఆర్ చలవతోనే తాను ఎమ్మెల్యే అయ్యాయని తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు ఈ దుష్ప్రచారాన్ని నమ్మవద్దని, తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అంబర్‌పేట నియోజకవర్గంలో పార్టీ బూత్‌స్థాయి సమావేశాలు నిర్వహించి కార్యకర్తలకు ఎన్నికలపై అవగాహన, దిశానిర్దేశం చేయనున్నట్టు వెల్లడించారు. బీఆర్‌ఎస్ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు.

మోసం కాంగ్రెస్ నైజం

మొదటిపేజీ తరువాయి...

మభ్యపెడుతున్నారు. కాంగ్రెస్ మోసాలను యువత ఎక్కడికక్కడ ఎండగట్టాలి. గ్రామాల్లో ప్రజల మధ్య చర్చ పెట్టాలి. మోసపూరిత వాగ్దానాలు చేసే పార్టీల నాయకులకు బుద్ధి చెప్పాలి' అని పిలుపునిచ్చారు. సోమవారం సిద్దిపేటలోని కొండా భూదేవి గార్డెన్‌లో మేర్గు మహేశ్ అధ్యక్షతన విద్యార్థి, యువత, సోషల్‌మీడియా వారియర్స్‌తో, నర్సాపూర్‌లో నిర్వహించిన సమావేశాల్లో మెదక్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఐదేండ్లకు మించి పాలన సాగించిన రాష్ట్రం లేదని తెలిపారు. కొన్ని రాష్ట్రాల్లో మధ్యలోనే సెల్ఫ్‌గోల్ కొట్టుకొని అధికారం కోల్పోయారని ఎద్దేవా చేశారు. తెలంగాణలోనూ ఎన్ని రోజులు ఉంటుందో తెలియదని వెల్లడించారు. 'బీఆర్‌ఎస్ నేతలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బంది పెడుతున్నది. కానీ మనం అధికారంలో ఉన్నన్ని రోజులు అభివృద్ధి చేయాలన్న తపనతోనే ముందుకు సాగాం. ఒక్కటి మాత్రం పక్కా.. ఇటు ఉన్న సూర్యుడు అటు పొడుసుడు ఎంత నిజమో మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి రావటం కూడా అంతే నిజం. భవిష్యత్తు మనదే. ఎవరూ అధైర్యపడొద్దు' అని భరోసా కల్పించారు.

రేవంత్‌కు కర్రుకాల్చి వాత పెట్టాలి

జిల్లాలు రద్దు చేస్తానన్న రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్పాలని ప్రజలకు హరీశ్ పిలుపునిచ్చారు. 'నోటికి కాడి బుక్కను ఎత్తగొడతా అంటున్నావ్. మా జిల్లాను రద్దు చేస్తా అంటున్న నీకు ఎందుకు ఓటు వేయాలి' అని రేవంత్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. 'మెదక్, సంగారెడ్డి, సిద్దిపేటను జిల్లాలుగా చేసి కేసీఆర్ అందరి ఆకాంక్షలను నెరవేర్చిండు. పరిపాలనను దగ్గరకు తెచ్చిండు. ఉన్న దాన్ని ఈ సీఎం రేవంత్‌రెడ్డి కరాబ్ చేస్తున్నడు. నీకు(రేవంత్) నీతి, నిజాయతీ ఉంటే ఇంకా మంచి పాలన చేయాలి' హితవు చెప్పారు. హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలంటే ప్రశ్నించే గొంతుక బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. రుణమాఫీ వచ్చినవాళ్లంతా కాంగ్రెస్‌కు, రాని వాళ్లంతా బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని అన్నారు. నర్సాపూర్‌కు కేసీఆర్ ప్రత్యేకంగా నిధులు ఇచ్చారని, డిపో, మంజీరాపై చెక్‌డ్యాంలు నిర్మించారని తెలిపారు. ఇచ్చిన హామీలు.. ఇవ్వని హామీలనూ నెరవేర్చారని వెల్లడించారు. కాంగ్రెస్ తీరు మాత్రం ఓడ దాటేదాక ఓడ మల్లన్న, ఓడ దాటినంక ఓడ మల్లన్నలా ఉన్నదని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలకు చరమగీతం పాడిందని ఫైర్ అయ్యారు. 'కల్యాణలక్ష్మి ఇవ్వలేదు. ఇస్తామన్న తులం బంగారం ఎగబెట్టారు. స్కూటీలు ఇస్తామని మాట తప్పారు. కాంగ్రెస్ వచ్చింది.. కేసీఆర్ కిట్ బంద్ అయ్యింది.

సిద్దిపేటలో యువత, విద్యార్థి, సోషల్ మీడియా వారియర్స్‌తో మాట్లాడుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

కరెంట్ కోతలు స్టార్ట్ అయ్యాయి. అన్నివర్గాల ప్రజలను రేవంత్‌రెడ్డి మోసం చేసిండు' అని చెప్పారు. అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సురుకు పెట్టాలని అన్నారు.

తెలంగాణ రాకపోతే సిద్దిపేట జిల్లా అయ్యేదా?

'బీఆర్‌ఎస్ లేకపోతే తెలంగాణ వచ్చేదా? తెలంగాణ రాకపోతే సిద్దిపేట జిల్లా అయ్యేదా? సిద్దిపేట జిల్లా కాకపోతే ఇంత అభివృద్ధి జరిగేదా? ఇయ్యాల ఎవడెవడో ఏదేదో మాట్లాడుతున్నారు. కేసీఆర్ ఉద్యమించిన నాడు మన మంత్రి, పోరాటాలు చేసిన రోజు తెలంగాణ రాష్ట్రం వస్తది అంటే ఎవరు నమ్మలేదు. చావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిండు మన కేసీఆర్. ఎంతో మంది విద్యార్థులు, యువకులు ప్రాణత్యాగాల మీద, కేసీఆర్ పోరాటం ఫలితంతో ఇయ్యాల స్వరాష్ట్రం సిద్ధించింది. రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో ఒక్కనాడైన జై తెలంగాణ అన్నాడా?. మనం తెలంగాణ కోసం కొట్లాడితే సమైక్యవాద తెలుగుదేశంలో ఆంధ్రా నాయకుల మడుగులు ఒత్తుతూ తెలంగాణ అంటే కాల్చేస్తా అని తుపాకీ పట్టుకొని మనమీదికి వచ్చిండు. రైఫిల్‌రెడ్డి.. రేవంత్ రెడ్డి. ఒక్కరోజైనా తెలంగాణ అమరవీరుల స్థూపం వద్దకు పోయి రెండు పువ్వులు కూడా పెట్టలేదు. అటువంటి వ్యక్తి ఇయ్యాల తెలంగాణకు సీఎం కావటం దురదృష్టకరం' అని వెల్లడించారు.

వెంకట్రామిరెడ్డిని గెలిపించాలి

దుబ్బాక ప్రజలను మోసం చేసినందుకు రఘునందర్‌రావును ప్రజలు మడతపెట్టి ఉతికారని హరీశ్ అన్నారు. మెదక్‌కు బీఆర్‌ఎస్ కంచుకోట అని, వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కలెక్టర్‌గా ఎన్నో మంచి కార్యక్రమాలు చేశారని, ఎంపీగానూ సేవా కార్యక్రమాలు చేస్తారని వెల్లడించారు. ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. ఎక్కడైతే కలెక్టర్‌గా పనిచేశానో, అక్కడే ఎంపీగా పోటీ చేసే అవకాశం రావటం అదృష్టమని అన్నారు. 'మన పార్టీ కార్యకర్తలు చూపించిన వారికి నేను ఏర్పాటు చేసే ఫంక్షన్ హాళ్ల ద్వారా ఒక్క రూపాయికే సేవ అందిస్తా. పేదల పిల్లల కోసం వంద కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నా. 50 ఏండ్ల పాటు నా సేవలు గుర్తు ఉండిపోయేలా చేస్తా. సేవాభావంతో ముందుకు వస్తున్న నన్ను భారీ మెజార్టీ గెలిపించాలి అని కోరారు.

అందరి జీవితాల్లో వసంతం పూయాలి

రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ ఉగాది శుభాకాంక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం సందర్భంగా బీఆర్‌ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉగాది నుంచి కాలచక్రం తిరిగి మొదలవుతుందని, చెట్లు చిగురిస్తూ ప్రకృతిలో నూతనోత్తేజం నెలకొంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ పనులను రైతన్నలు ఉగాది నుంచే ప్రారంభిస్తారని అందువల్ల ఉగాదిని వ్యవసాయ నామ సంవత్సరంగా పిలుచుకుంటామని తెలిపారు. ప్రజల జీవితాల్లో వసంతాన్ని నింపి, క్రోధినామ సంవత్సరంలో ప్రజలు ప్రశాంతంగా జీవించేలా దీవించాలని ప్రకృతిమాతను ప్రార్థించారు.

కొత్త ఏడాదిలో కాలం కలిసి రావాలి: సీఎం రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీక్రోధి నామ సంవత్సరంలో ప్రజలందరికీ శుభం కలగాలని, ఆశలు, ఆకాంక్షలన్నీ నెరవేరాలని ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని అభిలషించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు చాటిచెప్పేలా ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు తెలంగాణభవన్‌లో ఉగాది వేడుకలు

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం తెలంగాణభవన్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు జరిగే వేడుకలకు బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు హాజరు కానున్నారు. తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

పొద్దుతిరుగుడు పంటను మొత్తం కొనాలి

37,300 క్వింటాళ్లు మాత్రమే కొనేందుకే కేంద్ర సర్కారు అంగీకారం

మిగతా పంటను రాష్ట్రమే సేకరించాలి • రైతులకు ఏమాత్రం నష్టం కలిగించొద్దు

సీఎంకు మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో పండించిన మొత్తం పొద్దుతిరుగుడు పంటను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దిగుబడి అయ్యే 1,65,800 క్వింటాళ్ల పొద్దుతిరుగుడు పంటలో కేంద్ర ప్రభుత్వం తన నిధులతో 37,300 క్వింటాళ్లు మాత్రమే కొనడానికి అంగీకరించిందని, మిగతా పంటను ఎంఎస్‌పీతో రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఆ లేఖ పూర్తి పాఠం ఇలా..

'రాష్ట్రంలో ఉమ్మడి మెదక్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 20,829 ఎకరాల్లో ఈసారి రైతులు పొద్దు తిరుగుడు పువ్వు (సన్‌ఫ్లవర్) పంట వేశారు. ఈ పంటకు మార్కెట్లో కనీస మద్దతు ధర లభించడం లేదని నేను ఈ ఏడాది ఫిబ్రవరి 22న ప్రభుత్వానికి లేఖ రాశాను. స్పందించిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మద్దతు ధర రూ.6,760 చెల్లించి పంటను కొంటామని హామీ ఇచ్చారు. దాని ప్రకారమే మార్కెట్లలో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. అయితే, కేంద్ర ప్రభుత్వం తన వాటాగా సేకరించాలనుకున్న మేరకే కొనుగోలు చేశారు. మిగతా పంటను ప్రస్తుతం కొనుగోలు చేయడం లేదు. దీంతో 75 శాతం పంటను రైతులు చాలా తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోవాల్సి వస్తున్నది.

గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చివరి గింజ వరకూ..

రాష్ట్రంలో 1,65,800 క్వింటాళ్ల పొద్దు తిరుగుడు పంట దిగుబడి వస్తుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం తన నిధులతో 37,300 క్వింటాళ్లు (25శాతం) మాత్రమే కొనడానికి అంగీకరించింది. మిగతా 75 శాతం పంటను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్లు రైతులు పండించిన చివరిగింజ వరకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మద్దతు ధరతో కొనుగోలు చేసిన విషయాన్ని మీకు గుర్తు చేస్తున్నాను. ఈ సారి కూడా రైతులు పండించిన చివరి గింజ వరకు కనీస మద్దతు ధర రూ.6,760 చెల్లించి పొద్దు తిరుగుడు పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. మీరే స్వయంగా జోక్యం చేసుకుని పొద్దు తిరుగుడు పువ్వు పంటను మొత్తం కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసి, రైతులు ఆదుకోవాలని కోరుతున్నాను' అని పేర్కొన్నారు.

యూపీఏ హయాంలోనూ ఫోన్ ట్యాపింగ్

- **నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఒప్పుకున్నారు**
- **పెగాసస్‌తో బీజేపీపై కూడా ఆరోపణలు**
- **ఈ కేసులో కొందరిని కాపాడే యత్నం**
- **రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయ్యాయి**
- **బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిషాంక్ ఆరోపణలు**

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): జాతీయ భద్రత కోసమే ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నట్టు ప్రధానిగా మన్మోహన్‌సింగ్ ఉన్నప్పుడు ప్రకటించారని బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిషాంక్ తెలిపారు. యూపీఏ హయాంలో ఫోన్ ట్యాపింగ్ జరిగినట్టు మన్మోహన్‌సింగ్ ఒప్పుకున్నారని, మరి దానికి ఎవరు బాధ్యులని, ఎవరిని జైల్లో పెట్టాలో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ గురించి బహిరంగ సభలో మాట్లాడిన కాంగ్రెస్ నేతలు సెల్ఫ్ గోల్ చేసుకున్నారని అన్నారు. తెలంగాణ భవన్‌లో సోమవారం క్రిషాంక్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రూ.100 కోట్లు ఖర్చు పెట్టి నిర్వహించిన కాంగ్రెస్ సభలో మాట్లాడిన ప్రతి ఒక్కరు కేసీఆర్‌ను తిట్టడానికే ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. దీనిని బట్టి వారిలో కేసీఆర్ భయం ఎంత ఉన్నదో అర్థం అవుతున్నదని చెప్పారు. రాహుల్ ఎప్పుడైనా సెల్ఫ్ గోల్ చేసుకోగల సమర్థుడని ఎద్దేవా చేశారు. రైతు ఆత్మహత్యలు, ఎండిపోతున్న పంటల నుంచి దృష్టి మరల్చడానికి, 100 రోజుల్లో చేసిన పనుల గురించి ఏమీ చెప్పుకోలేక కేసీఆర్‌పై రాహుల్‌గాంధీ ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం వెబ్‌సిరీస్ నడిపిస్తుందని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీకి ఈడీ, కాంగ్రెస్ పార్టీకి ఫోన్ ట్యాపింగ్ దొరికాయని అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో పది లక్షల ఫోన్లను ట్యాప్ చేస్తే పది లక్షల ఆఫీసులు కావాలి కదా.. ఎన్ని ఆఫీసులను సీజ్ చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు ఫోన్ ట్యాపింగ్ అవసరమని అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ చెప్పారని అంటూ.. అప్పటి వీడియోను క్రిషాంక్ ప్రదర్శించారు. రాహుల్ గాంధీ ఫోన్‌ట్యాపింగ్‌పై సోయి లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు.

నిష్పక్షపాతంగా విచారణ జరగాలి

ఫోన్‌ట్యాపింగ్‌పై రాజకీయ విచారణ కాకుండా నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ చేయాలని క్రిషాంక్ డిమాండ్ చేశారు. ట్రాయ్, పోలీసు ఉన్నతాధికారులను విచారణకు పిలవాలని అన్నారు. జానారెడ్డి హోంమంత్రిగా ఉన్నప్పుడు ఆయనపై హరిరామజోగయ్య ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కొందరిని కాపాడే ప్రయత్నం జరుగుతున్నదని చెప్పారు. గతంలో డీజీపీగా పనిచేసిన మహేందర్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలను నిరాధారనమైనవిగా కొట్టివేశారని, శివధర్‌రెడ్డి, రవిగుప్తాను ఈ కేసులో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. పోలీసు అధికారులను టార్గెట్ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. గత ప్రభుత్వం, కేసీఆర్‌పై ఆరోపణలే లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. మొదట అరవింద్‌కుమార్‌ను టార్గెట్ చేశారని, ఆ తరువాత జయేశ్ రంజన్‌ను లక్ష్యంగా చేసుకున్నారని చెప్పారు. పెగాసస్‌తో బీజేపీ వాళ్లు కూడా ఫోన్ ట్యాపింగ్ చేసినట్టు ఆరోపణలు వచ్చాయని, దీనిపై రాహుల్‌గాంధీ మాట్లాడలేదని అన్నారు.

మంచిర్యాలలో జరిగిన మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, నడిపెల్లి దివాకర్ తదితరులు

కాంగ్రెస్‌ది అసమర్థ పాలన

- **రాష్ట్రంలో ఆత్మహత్యలు పట్టని ప్రభుత్వం**
- **మీడియాతో బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దివాకర్‌రావు**

మంచిర్యాల టౌన్, ఏప్రిల్ 8: అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ పాలన నడుస్తున్నదని, 4నెలల పాలనలో రైతాంగాన్ని అథోగతి పాల్జేసిందని బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. సోమవారం మంచిర్యాలలో మీడియా సమావేశంలో మాజీ విప్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి మాట్లాడారు. పంటలు ఎండిపోయి రైతులు, గిరాకీలు లేక ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. 209 మంది రైతులు చనిపోతే ఎక్కడ చనిపోయారని స్వయంగా సీఎం అడగడం సిగ్గుచేటని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేని అసమర్థ ప్రభుత్వమని ఆయన విమర్శించారు. మాజీ విప్ బాల్క సుమన్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు అని చెప్పి, అధికారంలోకి రాగానే ఒక్కటీ అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు అంతర్గత ఒప్పందంతో ముందుకు సాగుతున్నాయని ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కొడుకు హర్ష ఖరీదైన వాచీల కొనుగోలు విషయంలో చెన్నై కస్టమ్స్ అధికారులు నోటీసులు ఇచ్చిన విషయమై స్పందించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్లే ఎండిన పంటలు

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 8 : కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడం వల్లే సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి గుడిపల్లి వరకు సాగునీరందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. పదేండ్లు అభివృద్ధి చేసిన రాష్ట్రాన్ని వంద రోజుల్లోనే కాంగ్రెస్ భ్రష్టుపట్టించిందని విమర్శించారు. ఇగురం లేని పాలన చేసి రైతులకు నీరందకుండా చేశారని, పంటలు ఎండిపోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన కార్యకర్తలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి మోసపోయామని ప్రజలు, రైతులు బాధపడుతున్నారని అన్నారు. నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరిట కాంగ్రెస్ దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. పంటలు ఎండిపోతున్నా, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి. చిత్రంలో అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, గువ్వల, మర్రి జనార్దన్‌రెడ్డి

ఖమ్మం జిల్లా చిమ్మపూడిలో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం ఎంపీ నామా. చిత్రంలో ఎమ్మెల్సీ తాతా మధు

ప్రజలకు కాంగ్రెస్ మొండిచెయ్యి

- **ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి**
- **ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు**

రఘునాథపాలెం, ఏప్రిల్ 8 : కాంగ్రెస్ పార్టీ తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలకు మొండిచెయ్యి చూపిస్తున్నదని ఖమ్మం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం చిమ్మపూడి గ్రామంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ గొంతుకను పార్లమెంట్‌లో వినిపించేందుకు, రాష్ట్ర ప్రయోజనాల కోసం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పదేండ్లు ముఖ్యమంత్రిగా ఉండి రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారని కొనియాడారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వంద రోజుల్లోనే రాష్ట్ర ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి గెలిచిన ఎంపీలు ఏనాడూ జిల్లా, రాష్ట్ర ప్రయోజనాలను గుర్తించి మాట్లాడిందిలేదన్నారు. కేంద్రం నల్లచట్టాలు తీసుకొచ్చి మీటర్లు పెట్టాలని చూస్తే బీఆర్‌ఎస్ పార్టీ కొట్లాడి అడ్డుకున్నదని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ.. నామాను గెలిపించుకుంటే వచ్చే ఐదేండ్లు కార్యకర్తలకు కొండంత అండగా ఉంటారని తెలిపారు.

57వేల కోట్లు ఏం చేశారు?

ఆర్ ట్యాక్స్, బీ ట్యాక్స్ వసూలుకే ప్రాధాన్యం • బీజేపీఎల్పీనేత మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వానికి గత నాలుగు నెలల్లో రూ.40 వేల కోట్ల ఆదాయం వచ్చిందని, మరో రూ.17 వేల కోట్ల అప్పు చేసిందని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మొత్తంగా రూ.57 వేల కోట్లు ఖజానాలో చేరాయని, ఈ మొత్తాన్ని ఏం చేశారో ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని పక్కనపెట్టి ఆర్ ట్యాక్స్, బీ ట్యాక్స్‌ల వసూలుకే ప్రాధాన్యం ఇస్తున్నదని మండిపడ్డారు. ప్రతిక్షణం ఏ కాంట్రాక్టర్‌కు బిల్లు ఇస్తే కమీషన్ వస్తుందనే ఆలోచిస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు అనేక హామీలు ఇచ్చి, ఇప్పుడు నిండా ముంచారని విమర్శించారు. బ్యాంకర్లు రైతులకు నోటీసులు ఇస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు కోసం రూ.7 వేల కోట్లు జమ చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిధులను దేనికి ఉపయోగించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నీటి నిర్వహణ లోపం కారణంగా లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, నష్టపోయిన రైతులకు తక్షణ సాయం రూ.10 వేలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.

మాయచేసి మభ్యపెట్టిన కాంగ్రెస్

- **అబద్ధపు పునాదులపై అధికారంలోకి..**
- **ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ హెచ్చరిక**
- **బీఆర్‌ఎస్ విద్యార్థి యువజన చైతన్య సదస్సులో పాల్గొన్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్**



రామడుగు (చొప్పదండి) ఏప్రిల్ 8 : ఆరు గ్యారెంటీల అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ప్రజలను మాయ చేసి మభ్యపెట్టిందని, గ్యారెంటీలను అమలు చేయకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం కరీంనగర్ జిల్లా రామడుగు మండలం దేశరాజ్‌పల్లి శివారులోని వసుధ గార్డెన్‌లో చొప్పదండి నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ విద్యార్థి యువజన చైతన్య సదస్సు నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, గెల్లు శ్రీనివాస్ పాల్గొన్న ఈ సదస్సులో దేశపతి మాట్లాడుతూ.. గోదావరి, కృష్ణా నదులపై కాళేశ్వరం, పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టులను నిర్మించి కోటి ఎకరాలకు సాగునీళ్లు ఇచ్చినట్టు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం నిధులు తెచ్చామని, పదేండ్లలో 1.61 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో 30 వేల ఉద్యోగాలకు గత ప్రభుత్వం పరీక్షలు నిర్వహించిందని చెప్పారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతు వినిపించాలంటే వినోద్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

సమస్యలపై ప్రశ్నించే గొంతునవుతా

ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ చేసిన అబద్ధపు ప్రచారాలతో అప్పుడు మోసపోయామని, మళ్లీ మోసపోవద్దని ఎంపీ అభ్యర్థి వినోద్ అన్నారు. మరోసారి తనను ఎంపీగా గెలిపిస్తే ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతునవుతానని పేర్కొన్నారు. యాసంగి సీజన్‌లో ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవాస్తవాలు ప్రచారం చేయొద్దు

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): కొన్ని రోజులుగా తనపై వస్తున్న అసత్య ఆరోపణలను ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తన గురించి మీడియా, సోషల్ మీడియాల్లో జరుగుతున్న ప్రచారం అంతా అవాస్తమని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనకు ఫోన్ ట్యాపింగ్‌తో ఎలాంటి సంబంధం లేదని స్పష్టంచేశారు. ఈ వ్యవహారంలో తనపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అవాస్తవాలను ప్రచారం చేయవద్దని సూచించారు. తన గెస్ట్‌హౌస్ సహా తన ఇంట్లో ఎలాంటి తనిఖీలు జరగలేదని పేర్కొన్నారు. తనపై కుట్రపూరితంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చౌటుప్పల్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎంపీ బడుగుల, భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, కూసుకుంట్ల

కాంగ్రెస్‌ను రైతులే బొంద పెడ్తరు

- **ఓటేసినందుకు బాధపడుతున్నరు**
- **మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి**
- **చౌటుప్పల్‌లో బీఆర్‌ఎస్ పార్టీ సన్నాహక సమావేశం**

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ) : నీళ్లియ్యక పంటలను ఎండబెట్టిన కాంగ్రెస్ సర్కార్‌ను రైతులు బొందపెట్టడం ఖాయమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి హెచ్చరించారు. రుణమాఫీ, రైతుబంధు, బోనస్ ఇవ్వడం చేతకాని కాంగ్రెస్ నేతలు ఎన్నికల కమిషన్ పేరుతో రైతులను మోసం చేశారని ఆయన మండిపడ్డారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్‌లో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బీఆర్‌ఎస్ మునుగోడు నియోజకవర్గ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారం కోసం అడ్డదారులు తొక్కిందని, ఆ పార్టీకి ఎందుకు ఓటేశామా? అని జనం బాధపడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ఉన్న నీళ్లను కాపాడుకోలేని దద్దమ్మలు కాంగ్రెస్ నేతలు అని దుయ్యబట్టారు. వంద రోజుల్లో కాంగ్రెసోళ్లు రాష్ట్రాన్ని వందేండ్లు వెనక్కి తీసుకెళ్లారని విమర్శించారు. బీఆర్‌ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ మాట్లాడుతూ.. కల్లబొల్లి మాటలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు భిక్షమయ్య గౌడ్, రవీంద్రకుమార్, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో తడిసిన వడ్లను కుప్ప చేస్తున్న యువకులు(ఇన్‌సెట్‌లో) సోంపూర్‌లో కురిసిన వడగండ్లు

పలు జిల్లాల్లో వానలు.. పంట నష్టం

మంచిర్యాల, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/కోటగిరి/చందూరు/భీమ్‌గల్: ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లా కేంద్రాలతో పాటు పలు మండలాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము దాకా జల్లులు పడ్డాయి. ఆదిలాబాద్ జిల్లా సిరికొండలో సోమవారం 14.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చిరు జల్లులకు ఆరబోసిన వరి, ఈదురు గాలులకు మామిడి రైతులకు ఇబ్బంది ఏర్పడింది. నిజామాబాద్ జిల్లా వర్ని, చందూరు, కోటగిరి, రుద్రూర్ మండలాలు, టాక్లీ, సోంపూర్, కొల్లూర్, సుంకిని గ్రామాల్లో సోమవారం వడగండ్ల వర్షం కురిసింది. పలుచోట్ల వరిపైర్లు దెబ్బతిన్నాయి.

వచ్చే ఐదు రోజులు వర్షాలు

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): ఎండలతో జనం అల్లాడిపోతున్న ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లటి వార్త చెప్పింది. మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉన్నట్టు తెలిపింది.